# గోవు మాలక్ష్మికీ...

-మల్లాది రవిశంకర్

ఆఫీసు పనిమీద ఆ ఊళ్లో అడుగుపెట్టిన నన్ను గోడమీది వాల్ పోస్టర్ ఆకట్టుకుంది.

"గోమాతకి శ్రీమంతం జరుగుతోంది. అంతా ఆహ్వానితులే" అని పోస్టర్ చూడగానే ఒక సందేహం కలిగింది.

గోమాతని పూజించే దేశం ఇది. గోమూత్రాన్ని భక్తిగా స్వీకరించే దేశమిది. అందుకే ఆఫీస్ పని అయిపోయినా ఈ శ్రీమంత కార్యక్రమం చూడాలని ఇంకో రోజు ఆ ఊళ్లోనే ఉండిపోయాను.

గోమాతకి శ్రీమంతం ఆర్భాటంగా జరుగుతోంది. గుడి ఆవరణలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గోమాతని అందంగా అలంకరించారు. కొమ్ములకి గాజులు తొడిగారు. హారతిలిచ్చారు. శ్రీమంతం పాటలు పాడారు.

వచ్చిన అందరికీ గోమాత కడుపు చల్లగా ఉండి పండంటి కోడెదూడని ప్రసవించాలని చలిమిడి పంచి పెట్టారు.

వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేసారు.

గోమాతని గుళ్లో చెట్టుకి కట్టేసారు. వచ్చిన వారందరూ గోమాతకి నమస్కరిస్తున్నారు. అందరూ భోజనాలు చేస్తుండగా ఎవరో పిడుగులాంటి వార్తని కంగారుగా మోసుకొచ్చారు.

'వరదలు ఉధృతంగా ఉన్నాయనీ, దాని ప్రభావంవల్ల బుడమేరు పొంగి పొర్లుతోందనీ, కరకట్టుకి గండిపడే అవకాశం ఉందనీ, అదే జరిగితే ఊరు వరద నీటిలో మునిగి పోతుందనీ'

గోమాత శ్రీమంతానికి వచ్చిన వాళ్లంతా ఎక్కడివక్కడ వదిలేసి చేతులు కూడా కడుక్కోకుండా ఎవరిళ్లకి వాళ్లు పరుగెత్తారు.

ఇంటిని కాపాడుకోవాలనీ, పిల్లాపాపల్నీ, ఆస్తిపాస్తుల్నీ, ప్రాణాలనీ కాపాడుకోవాలనే ఆరాటంతో.

అయిదు నిముషాల్లో గుడి ప్రాంగణమంతా ఖాళీ అయిపోయింది.

శ్రీమంతం చేయించుకుంటున్న ఆవు మాత్రం చెట్టుకి కట్టేసి ఉండడంతో 'అంబా' అని గొంతెత్తి అరుస్తోంది.

పొంగి పొరలుతున్న బుడమేరు ప్రభావం గుడి కోనేరు మీద కూడా ఉన్నట్లుంది. కళ్ల ఎదుటే కోనేటి నీటిమట్టం పెరిగిపోయింది. వరద నీరు గుడి ప్రాంగణంలోకి కూడా వస్తుంటే గోమాత మరింత పెద్దగా అరుస్తోంది.

గుడి ప్రాంగణంలో మిగిలిపోయిన నేనొక్కడినే కట్టేసి వున్న గోమాత పలుపుతాడు విప్పి దాన్ని బంధ విముక్తురాలిని చేసాను.

గోమాతని చూస్తుంటే మా నాయనమ్మ గుర్తుకొచ్చింది.

నా ఏడేళ్ల వయసులో జరిగిన సంఘటనలు ఇంతకాలం తరువాత గుర్తుకు రావడం మొదలు పెట్టాయి.

***

ఆ రోజుల్లో అన్ని కుటుంబాలలాగానే మాది కూడా సమిష్టి కుటుంబం.

సంవత్సరం పొడవునా ఇంట్లో బాలింతలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలూ, పెళ్లిళ్లు, పేరంటాలు, సందళ్లూ...వచ్చిపోయే స్నేహితులు, బంధువులు.

అలాంటి ఇంటికి మూల విరాట్టు మా నాయనమ్మ. తేనెతో మాగిన తీపి మామిడిపండులాంటి నిండు ముత్తయిదువు. ఆవిడ మాటంటే మాటే. దానికి ఎదురుచెప్పే ధైర్యసాహసాలు ఎవరికీ ఉండేవి కాదు.

ఊళ్లోని వారికి కూడా ఆవిడ మాటంటే ఎంతో గురి. మంచి చెప్పాలన్నా, చెడు సమయాల్లో పెద్ద దిక్కుగా ఉండాలన్నా 'నాయనమ్మగారూ' అంటూ వచ్చేవాళ్లు సలహాలకి, సంప్రదింపులకి.

పిల్లాజెల్లా, మందీ మార్బలం అంటేనే కాకుండా గొడ్డూ గోదా, బీదా బిక్కీ అన్నా కూడా ఆమెకు అపారమైన జాలి కూడాను.

'అంబా' అని అరుస్తున్న ఆవు వీపు మీద చరిచి "నాలుగు పచ్చగడ్డి పరకలు, ఉలవగింజలు దీనికెయ్యండ్రా. పాపం దానికి ఆకలి వేసినట్లుంది" అని నాయనమ్మ కేకేసిందే తడవుగా తక్షణమే చిన్న పాలేరు ఆమె ఆజ్ఞని శిరసావహించేవాడు.

'యానాది నరిసిగాడి కోడలు నీళ్లోసుకుందట' అనే వార్త తెలిసిన తక్షణమే 'పాపం దాని నోరు పులుపు కోరుకుంటోందేమో'నని పెద్ద చేను గట్టుమీది మామిడి చెట్టు కాయలు నాలుగు తెప్పించి దానికి పంపించేది. 'అంకెడు కొడుకులూ, గోనెడు కూతుళ్లు పుట్టాలే నీకు' అని ఆపేక్షగా ఆశీర్వదించేది.

ఇంట్లో ఎప్పుడు ఏ శుభకార్యం జరిగినా నాదసర్వం పట్టుకుని ఒక భజంత్రీ వచ్చేవాడు. అతనికి చిన్నతనంలో నుదుటిపైన కంటి ఆకారంలో చిన్న దెబ్బ తగలడంతో అది మూడోకన్నులాగా కనిపిస్తుంది. ఊళ్లో అందరూ అతన్ని 'మూడు కళ్లాడు' అనేవాళ్లు.

వాడు ఎప్పుడో అన్న మాటలు మా నాయనమ్మ చెవినపడ్డాయి.

'ఇంత పప్పు వేసుకుని, ఇంత నెయ్యి వేసుకుని తింటే ...'' అంటూ ఆ మాటలు గుర్తు పెట్టుకున్న నాయనమ్మ, వాడెప్పుడూ కనిపించినా "ఇంత ముద్దపప్పు, ఇంత పేర్నెయ్యా, గుప్పెడన్నం వాడికి పెట్టండర్రా. వాడి జిహ్వాకి ఆ రుచి బాగుంటుందిట.

పెట్టిన చెయ్యి ఎప్పుడూ పైనే వుంటుంది. తిని సంతోషిస్తాడు'' అని చెప్పి మరీ పెట్టించేది.

నాన్నకి పక్క ఊరివాళ్లు ఒక ఆవునీ, పెయ్యనీ గోదానం చేసారు అప్పట్లో.

దానిని తోలుకుని వాకిట్లోకి తీసుకురాగానే ఎదురెళ్లి దానికి హారతిలిచ్చి దాని ముఖాన ఇంత పసుపు పూసి ఇంత కుంకుమమెత్తి పచ్చ గడ్డి తన చేతులతో తినిపిస్తుండగానే గడపల్లోనే ఇంత పేడకడి వేస్తే నాయనమ్మ ఆనందానికి



హద్దుల్లేవు.

'ఇంటికి సిరి వచ్చిందిరా' అంటూ ఒకటే సంబరం.

ఆమె అన్నట్లుగానే ఆ ఏడాది పంటలు బాగా పండాయి.

దాంతో ఆ ఆవుదూడల మీద ఆమె మమకారం మరింత పెరిగిపోయింది.

నాగుల చవతి వచ్చినా, రథసప్తమి వచ్చినా అడిగిన వాళ్లందరికీ కాదనకుండా గిద్దెడు ఆవు పాలయినా పోయించేది నాయనమ్మ.



## నిజమేనా?

నిన్న మొన్నటివరకూ టాప్‌స్టార్‌గా వెలిగిపోయి కోటి రూపాయలు పారితోషికం అందుకున్న తారగా రికార్డు క్రియేట్ చేసిన ఇలియానా ప్రస్తుతం తన రెమ్యునరేషన్‌ను బాగా తగ్గించుకున్నట్లుగా సినీ జనాలు చెప్పుకుంటున్నారు. కారణం ఏమిటని ఆరా తీస్తే కాజల్, సమంతలు వరుస విజయాలతో ముందుకు దూసుకుపోతుంటే... ఇక చేసేదేంలేక ఇలియానా క్రిందకు దిగి వచ్చినట్లుగా తెలుస్తోంది. శంకర్ తీయబోతున్న 'త్రీ-ఇడియట్స్' రీమేక్‌లో ఇలియానా కోటిన్నర వరకు డిమాండ్ చేస్తున్నట్లుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇందులో 'ఎంతవరకు నిజముందో కొంతకాలమాగితేగానీ తెలియదు.




"పుణ్యం అందరినీ మూటకట్టుకోనివ్వండ్రా. గో బ్రాహ్మణేస్తు శుభమస్తు నిత్యం, లోకస్సమస్తాం సుఖినోభవంతు..." అని పెద్దలు అననే అన్నారుకదా అనేది ఆమె.

ఆ ఏడు బాబాయిలిద్దరూ పట్నం వెళ్లి పెద్ద చదువులు చదువుకుంటామని పట్టుబట్టారు.

తాతగారు "నా శక్తికి మించిన బరువు నేను మోయలేను. చదివిన చదువులు చాలు. అన్నయ్యకి పొలం పనుల్లో సహాయం చేయండి" అని ఖరాఖండీగా చెప్పేసారు.

వాళ్ల వాగ్వివాదం నడుస్తూండగా నాయనమ్మ ఒకటే మాటంది.

"పెద్దాడు నేలని నమ్ముకున్నాడు. వీళ్లిద్దరూ రెక్కల్ని నమ్ముకుంటామని, వాటిని అమ్ముకుని నౌకరీలు చేస్తామని అంటున్నారు. వాళ్ల కోరికల్ని కాదనకండి. అవసరమైతే నా నగలు ఇస్తాను. వాటిని అమ్మయినా వాళ్ల కోరికని తీర్చండి. ఇంక దాని మీద అనవసరమైన వాగ్వివాదం వద్దు" అని తేల్చి చెప్పింది.

"నీ నగలు అమ్మడమెందుకు? అమ్మవారి నగలమ్మానని నాకు పేరు. ఏదో కిందో మీదో నేనే పడతాను" అని సణుక్కుంటూ, గొణుక్కుంటూ వాళ్ల చదువులకి ఒప్పుకున్నారు తాతగారు.

నాయనమ్మ తన మాట నెగ్గిందని ముసిముసి నవ్వులు నవ్వుతూ సంతోషంతో వెన్న చిలుకుతున్న ఆమె నా చేతిలో మరింత పెద్ద వెన్నముద్ద పెట్టింది.

పెద్దరుగుమీద నాయనమ్మ కూర్చుంటే వెనగ్గా వెళ్లి ఆమె మెడమీద చేతులేసి ఆమె వీపుమీద ఉప్పెక్కి "నాయనమ్మా" అని గట్టిగా అరిచేవాడిని.

ఆమె నవ్వు ముఖంతో "నాయనమ్మ నాశనమైపోయింది" అనేది.

"బామ్మా" అనేవాడిని.

"బామ్మ బుగ్గయింది" అనేది.

"మామ్మా" అనేవాడిని.

"మామ్మ మాడిపోయింది" అనేది.

మా ఇద్దరి సరసం ఇది. అలా అని నా బుగ్గల్ని పిండి ముద్దు పెట్టుకునేది. నేనూ ఆమె బుగ్గల్ని కొరికి ఎక్కిరించి పారిపోయేవాడిని.

ఆ రోజు...

ఇంకా కళ్లల్లో మెదులుతూనే వుంటుంది నాకు.

తెల్లవారుతూనే పెద్ద గాలీ వానా.

ఆకాశం, భూమీ కలిసినట్లుగా వర్షం, ఈదురుగాలి. పెనుతుఫానేమో అని అందరం భయపడ్డాం.

చేతికి అందబోతున్న పంటకి నష్టం వస్తుందని నాన్న నీళ్లు కారిపోయారు.

"ప్రకృతి విలయతాండవం చేస్తుంటే దాన్నెవరు ఆపగలర్రా పెద్దోడా? నలుగురితోపాటు మనం కూడా నారాయణ అనుకోవాలి. నష్టం మనకొక్కళ్లకే కాదుకదా. కూలినాలి చేసుకుని బ్రతికేవాళ్ల కష్టం ముందు మన నష్టం ఏపాటి? మనసును దిటవు చేసుకో. అంతా దైవేచ్ఛ. దేవుడి ఇచ్ఛ ఇలా వుంటే ఎవరం ఏమి చేయగలం?" అని నాన్నకి ధైర్యం చెప్పింది నాయనమ్మ.

"పాపం గూడెంలో జనం ఎంత అల్లల్లాడిపోతున్నారో? వాళ్ల గూడూ గుడిసె ఏమయిపోతున్నాయో? వాళ్లందర్నీ వచ్చి మన పెద్దరుగు మీద తల దాచుకోమని చెప్పు. కలో గంజో మనతోపాటే పంచుకుంటారు" అంది దొడ్డ మనసుతో నాయనమ్మ.

"ఇదేం విడ్డూరమమ్మా. వాళ్లని ఇంట్లోకి రమ్మంటోంది" అని అమ్మా, పిన్నీ చెవులు కొరుక్కుంటుంటే...

"వాళ్లూ మనుషులేనమ్మా. కష్టం వచ్చినప్పుడు మానవులంతా ఒక్కటే. మరీ ఇదిగా అనిపిస్తే ఈ జలప్రళయం ఆగిన తరువాత సంప్రోక్షం చేయించుకోండి. ఇప్పటికిలా కానీండి" అని తేల్చి చెప్పేసింది.

దాంతో బీదాబిక్కీ అంతా పెద్దరుగుమీదకి చేరుకున్నారు ఈ పెద్దమ్మ నీడలో వుంటే గండం గడుస్తుందనుకుంటూ.

ఆమె చేతిలో ఏ మహత్యం ఉందోగానీ తడికట్టెల్ని లాఘవంగా అంటించి శ్రమ అనుకోకుండా అంతమందికి స్వయంగా వండివార్చి వాళ్ల ఆకలిని తీర్చింది.

అన్నం తిని నడుం వాల్చామో లేదో గొడ్లపాకలో ఆవు దూడ అరుపు ఆర్తిగా ఆమె చెవిన తాకినట్టుంది.

కంగారుగా లేచి కూర్చుంది.

"పాపం గొడ్డూ గోదా పెనుగాలికి అల్లల్లాడుతున్నాయి. వాటిని కూడా ఇంట్లోకి తోలండి. మనతోపాటే అవి కూడా. మన జీవన యాత్ర వాటితోనే ముడిపడింది కదా" అని ఆర్తిగా అంటూ ఆ గాలివానలోనే బయటకు వస్తున్న నాయనమ్మ మీద పెనుగాలికి కూలుతున్న పందిరి గుంజ పడింది. అదే సమయానికి గొడ్లపాక కూలి ఆవుదూడలమీద పడింది. నాయనమ్మ నడుం విరిగింది.

అంత బాధలో కూడా "గొడ్లపాక కూలిపోయిందిరా పెద్దోడా. గొడ్డూ గోదా ఆవు దూడా సంగతి చూడు" అంది.

ఆ తరువాత నాయనమ్మ మంచంలో పడిపోయింది. ఆమె నోటి నుండి వచ్చిన చివరి మాటలివే.

ఆవూ దూడా చచ్చిపోయాయి.

పాతిక రూపాయలిచ్చి కబేళాకి తీస్కెడతానంటూ సాయిబు వచ్చాడు. సరేనంటున్న బాబాయి వంక కోపంగా చూసింది నాయనమ్మ.

ఆవిడ వంక కూడా చూడకుండా పాతిక రూపాయలు పుచ్చుకుని సాయిబుని తీస్కెళ్లమన్నాడు పెద్ద చదువులు చదివి ప్రాక్టికల్‌గా ఆలోచిస్తున్నాననుకునే బాబాయ్.

నాయనమ్మ కళ్లు చెమర్చాయ్ నా తరం ముగిసిందన్నట్లుగా.

ఆమె చేతి వెన్నముద్దలు తిన్న నా దృష్టిని ఆమె కన్నీళ్లు దాటిపోలేదు. ఆర్తిగా ఆమె కన్నీళ్లు తుడిస్తే ప్రేమగా నా వంక చూసింది.

ఆ తరువాత ఆమె మంచంలోనే రెండునెలలపాటు తీసుకుని చివరికి పోయింది.

ఆమె పోగానే ఆమె వంటిమీది నగల కోసం కొట్టుకున్నారు ఆమె కడుపున పుట్టిన బిడ్డలు.

తల్లి బంగారం తమదనీ, ఆస్తిలో ఆడపిల్లలకీ వాటా కావాలనీ ఆమె చేత పురుడు పోయించుకున్న ఆడకూతుళ్లు గొంతెత్తారు.

చివరికి అందరూ కూడబలుక్కుని ఆమె బంగారాన్ని కరిగించి వాటాలు పంచుకున్నారు.

గోమాత శ్రీమంతం నా చిన్ననాటి నాయనమ్మ కథని గుర్తుకు తెచ్చింది నాయనమ్మ పోయి ఏ లోకాన వుందోగానీ.

'అంబా' అని మోర ఎత్తి అరుస్తున్న గోమాత మళ్లీ నన్ను వాస్తవంలోకి తెచ్చింది.

నడుముదాకా నీళ్లు వచ్చేసాయి. నీటి వరవడి ఇంకా ఉధృతం అవుతోంది.

గోమాత మళ్లీ 'అంబా' అని అరిచి నన్నూ తనతో రమ్మన్నట్లుగా తల ఊపింది.

"ఇంకా ఆలోచిస్తావేమిట్రా మనవడా! గోమాత తోక పట్టుకో. అదే దారి చూపిస్తుంది" అని నాయనమ్మ మాటల్లాగా చెవికి వినిపించాయి.

నాయనమ్మ చెప్పాక ఇక ఆలోచించేదేముంది?

గోమాత గోదారికి ఎదురీదడానికి ఆయుత్తమవుతుంటే దాని తోకని ఆసరాగా పట్టుకుని పోయాను నేను.

★



## అద్భుత విన్యాసాలు

ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ టవర్ జంప్ పోటీలలో 421 మీటర్ల ఎత్తయిన కౌలాలంపూర్ టవర్ పైనుంచి 18 దేశాల నుంచి వచ్చిన 121 మంది ప్రొఫెషనల్ జంపర్స్ తమ అద్భుత విన్యాసాలతో అందరినీ ఆకట్టుకుని, ప్రతి ఏటా జరిగే ఈ పోటీలను విజయవంతం చేసారు.

